# స్వాగతం

నాన్‌స్టాప్ బస్‌లో ప్రయాణం చేస్తున్న గుర్నాధం మాష్టారి దృష్టి, డ్రైవర్ మీద పడింది ముందుకు తప్పితే మరెటూ చూడలేదు డ్రైవర్!

డ్రైవర్లు ముందుచూపు గలవాళ్ళయితే ఫరవాలేదు కాని వాళ్ళు మందుచూపు గలవాళ్ళయితే?

"అమ్మబాబోయ్!.... గొప్ప డేంజర్!" అని అనుకున్నారు గుర్నాధం మాష్టారు.

గుర్నాధం మాష్టారు దూరదృష్టిగలవారు!....... కనుకనే సుమారు ఓమీటరుముందున్న న్యూస్‌పేపరుపై అతని దృష్టి పడింది. ఆ న్యూస్‌పేపర్ని చదువుతున్న వ్యక్తి, తన వెనుక సీట్లోకూర్చున్నవాళ్లు చదువుకొనేటందుకు వీలుగా ఉంటుందనే సత్సంకల్పంతో అట్లా న్యూస్‌పేపర్ని పట్టుకోలేదు!.... అట్లా పట్టుకొని చదవకపోతే అక్షరాలతనికి సరిగ్గా కనిపించవు!.... అతని దృష్టి అట్లాంటిది!

ఆ న్యూస్‌పేపరులోని ఓవార్త గుర్నాధం మాష్టారి దృక్పథంలో పడింది!.........

"ఘోరమైన బస్సు ప్రమాదం!.... అక్కడికక్కడే పాతిక మంది మృతి!.... ముప్పైమందికి పైగా గాయాలు! కొందరి పరిస్థితి ప్రమాదకరంగావుంది!...." ఇదీ ఆ వార్త యొక్క సారాంశం.

తామిప్పుడు ప్రయాణం చేస్తున్న బస్సుకూడా అట్లానే ఘోరమైన ప్రమాదానికి లోనైతే?.... గుర్నాధం మాస్టారు ఆలోచింప సాగేరు!........

వార్తాపత్రికలన్నీ ఆవార్తను ప్రముఖంగా ప్రచురిస్తాయి.

ఆకాశవాణి ఆవిషాదవార్తను ప్రసారం చేస్తుంది.

ప్రముఖులు ప్రమాదస్థలాన్ని సందర్శిస్తారు. ప్రమాదకారణాన్ని అన్వేషించేటందుకై దర్యాప్తుకమిటీని నియమిస్తారు.

చనిపోయినవారి కుటుంబీకులకు, తీవ్రంగా గాయపడ్డవాళ్ళకు, స్వల్పంగా గాయపడ్డవాళ్ళకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి - ప్రభుత్వ నిబంధనలమేరకు, ఎవరికి ఎంతసొమ్ము ముట్టచెప్పాలో అంతముట్టచెప్పి, బాధ్యతా విముక్తులవుతారు ప్రభుత్వాధికారులు!

తనప్పుడు ప్రయాణంచేస్తున్న బస్సు, తీవ్రాతి తీవ్రమైన ప్రమాదానికి లోనై, తను అక్కడికక్కడే మరణిస్తే - తన కుటుంబీకులు పొందే ప్రయోజనాలగురించి ఆలోచించసాగేరు గుర్నాధం మాస్టారు !........

చావుకి స్వాగతం పల్కడం సామాన్యమయిన విషయం కాదు. బ్రతుకుపై రోతజనించినవాళ్ళు, బ్రతకడానికి భయపడేవాళ్ళు, ఆత్మవిశ్వాసాన్ని పోగొట్టుకున్న పిరికిపందలు, ఎట్లా బ్రతకడమో తెలియనివాళ్ళు - సాధారణంగా చావుకి స్వాగతంపల్కుతూంటారని గుర్నాధంమాస్టారికి తెల్సు!

తను ఉద్యోగంలో ఉంటూండగానే చస్తే, తనపెద్దకొడుక్కి ఏలినవారు ఉద్యోగమిచ్చి తీరతారు!.... అయితే తన చావు,

సహజసిద్ధమయినట్టిదిగా రుజువు కావాలి. ఆత్మహత్య కాకూడదు!

ఏదైనా ప్రమాదంలో చస్తే మరీమంచిది!.... ఏలినవారు రూల్సు ప్రకారం ఎక్సగ్రేషియో మంజూరు చేస్తారు! అంతే కాదు !....

అధికారుల సానుభూతి,
ప్రజాప్రతినిధుల సానుభూతి,
మంత్రుల సానుభూతి'
ముఖ్యమంత్రి సానుభూతి,
గవర్నరు సానుభూతి;
ప్రమాదం మరీ దారుణమైన దైతే.
ప్రధానమంత్రి సానుభూతి,
రాష్ట్రపతి సానుభూతి........

ఒహ్!.... బోల్డుమంది ప్రముఖుల సానుభూతి లభిస్తుంది మరణించినవారి కుటుంబీకులకు!

శవాల ఫోటోలు, ఆశవాలపక్క రోదిస్తున్నవారి ఫోటోలు, వారినోదారిస్తున్న ప్రజాప్రతినిధుల ఫోటోలు చాలా న్యూస్ పేపర్లలో చాలా ప్రముఖంగా ప్రచురించబడతాయి!........ ఘోరమైన ప్రమాదాలలో చనిపోయేవారిచావుకు, గొప్ప ప్రాచుర్యం లభిస్తుంది.

తానప్పుడు ప్రయాణిం చేస్తున్న బస్సు, తీవ్రమైన ప్రమా దానికిలోనై, తాను చావుబాధ అనుభవించకుండా టపీమనిచస్తే, తనవాళ్ళు సుఖపడతారు!....తన పెద్దకొడుక్కి వెంటనే ఉద్యోగ

మొస్తుంది తన భార్యకు పెన్షన్ లభిస్తుంది. అయితే అవచ్చే చావేదో. అదికాస్తా సుఖవంతమయిన దవాలనేదే తన కనీస కోరిక!........

.... అమధ్య మరో రెండుమాసాలకు రిటైరవుతారనగా, సుందరరావు మాష్టారు అంతిమశ్వాసవదిలేశారు!.... అప్పుడతని పెదకూతుర్ని, తమవూరి హైస్కూలులో రికార్డు అసిస్టెంటుగా అపాయింట్ చేశారు; సమితి అధ్యక్షులవారి కరుణాకటాక్ష వీక్షణాలు ఆమెపై అపారంగా పడ్డందువల్ల!!....

అయితే సుందరరావుమాష్టారు సుఖంగా చావలేదు!... తను చావడానికిముందు, ఇంట్లోవాళ్ళందర్నీ సుమారు ఏడాదిపాటు చంపుకుతిన్నారు!.... అతనికొచ్చిన జబ్బేంటో తేలేసరికి సుమారు ఆరుమాసాలు పట్టింది. కేన్సర్ వ్యాధట!.... ఆవ్యాధికి చికిత్స చేయించగలిగేపాటి ఆర్థికస్తోమత అతని ఆత్మీయులెవ్వరికీ లేదు! అయినా వూరుకోలేదు. అప్పుచేసి విశాఖపట్నం, ఆ తవారుత రాయవెల్లూరు తీసుకెళ్ళి చికిత్స చేయించేరు!

ఇల్లు గుల్లయింది. అతని ఒళ్ళు గుల్లయింది. అప్పటికి గాని అతనికి చావురాలేదు!

రిటైరవకముందతను చనిపోతే అతని కుటుంబీకులు సుఖపడతారని - అతని కోటీచర్సే కాక, అతని ఆత్మీయులుకూడా అనుకొనేవారు!.... అతని చావు పొడిగింపబడుతున్న కొద్దీ, ఇతను రిటైరవకుండా చావడేమోనని చాలామందిభయపడ్డారు.

అతని ఆత్మీయుల అదృష్టం బాగుండడంవల్ల, ఎట్లా అయితేనేం ఇంకో రెండుమాసాలకు రిటైరవుతారనగా సుందరరావు మాష్టారు చనిపోయేరు!....

ఏదిఏమైనా తనకుమాత్రం సుందరరావు మాష్టారికొచ్చిన చావులాంటిది రాకూడదనుకున్నారు. గుర్నాధంమాష్టారు!.... అయితేనొకటి!.... ఉద్యోగవిరమణ తేదీకి ముందుగానే తనకు సునాయాసమరణం వస్తే - ముప్ఫైయేళ్ళునిండిన తన పెద్ద కొడుక్కి ఏదో ఒవుద్యోగాన్ని ఏలినవారిస్తారు. తన భార్యకు పెన్షన్‌యిస్తారు. గ్రాట్యుయిటి, ప్రావిడెంటుఫండు, ఇన్సూరెన్సు పాలసీలవల్ల వచ్చేసొమ్ముతో కనీసం తన పెద్దకుమార్తెకయినా తనభార్య పెళ్ళిచేసేస్తుంది!.... తను మరో ఆరుమాసాలలో రిటైరయిపోతాడు. ఈ ఆరుమాసాలు తను బ్రతికుండడంవల్ల తన కుటుంబీకులు పొందే ప్రయోజనంకంటే; తను చావడంవల్లే తన కుటుంబీకులు అధికప్రయోజనం పొందగలరనుకున్నారు గుర్నాధంమాష్టారు !

లంచగొండితనంలో తను ఆరితేరినవాడై - లంచాలుగుంజేటందుకవకాశాలు అధికంగాగల ఏడిపార్టుమెంటులోనైనా తను పనిచేస్తున్నట్లయితే; ఉద్యోగ విరమణకుముందే తనిట్లా చావుకి స్వాగతం చెప్పుండేవాడుకాదేమో!.... కాస్తా జ్ఞానంవచ్చినప్పటినుండి తన బ్రతుకంతా కష్టాల కడలిలోనే ఊగిసలాడుతోంది. విశ్రాంతిలేని బ్రతుకయిపోయింది. శ్రమకు అంతమే విశ్రాంతా?.... ఉద్యోగ విరమణకు ముందే తనకు చావువస్తే; అది అతిసునాయాసంగా, వృధాఖర్చుని తన ఆత్మీయులకు తగల్చకుండా వస్తే; అదే తనకు నిజమైన విశ్రాంతి!.... కాని తనకంతపాటి అదృష్టమా?

చాలాకాలంక్రితం, శ్రీ గోపీచంద్‌గారు వ్రాసిన, "అసమర్ధుని జీవయాత్ర" అను నవల్ని చదివేడు తాను!... అయితే శ్రీ గోపీచంద్‌గారి 'అసమర్ధుని జీవయాత్ర' లోని కథానాయ

కుడయిన సీతారామారావుకి, తనకు అన్ని విషయాలలోను పోలికలు లేకపోయినా, నాటి సమాజపు దృష్టిలో శీతారామారావు ఎంతటి అసమర్థుడో, తనూ నేటి సమాజం దృష్టిలో అంతటి అసమర్థుడే! .... నేడీ లౌకికసమాజంలో సమర్థతకుగాని, అసమర్థతకుగాని; వృత్తి, ఉద్యోగం, ఆదాయం, అధికారం, పలుకుబడి, హోదా యిట్లాంటివన్నీ కొలబద్దలు!......... మానవత్వం, ప్రేమ, ఔదార్యం, దయ, దాక్షిణ్యం, త్యాగం యిట్లాంటివన్నీ వ్యక్తియొక్క అసమర్థతకు, చేతకాని తనానికి చిహ్నాలు !.... నేటి సమాజం దృష్టిలో తనొక అసమర్థుడు ! ఎంచేతంటే; ఈలోకంలో తనకెక్కడా స్వంతయిల్లులేదు. కనీసం పెద్దకుమార్తెకయినా యింకా పెళ్ళిచెయ్యలేదు. పెద్ద కొడుక్కి ఉద్యోగంసంపాదించలేదు. బ్యాంక్ అకౌంటు లేదు!.... ఇట్లా పేర్కొంటూ పోతే తన అసమర్థతకు బోలెడన్ని ఉదాహరణల్ని ఉటంకించవచ్చు!.... లోకుల దృష్టిలోనేకాక, తన ఆత్మీయుల దృష్టిలో కూడా తను వట్టి అసమర్థుడు, అప్రయోజకుడు !

ఇకపోతే శ్రీ రా. వి. శాస్త్రిగారు వ్రాసిన అల్పజీవి నవలలోని కథానాయకుడైన సుబ్బయ్యకు, తనకు అన్నివిషయాలలోనూ కాకపోయినా కొన్ని విషయాలలో మాత్రం పోలికలున్నాయి!.... అయితే పిరికివాడైన సుబ్బయ్యను, హీరోగా చేసిన మనోరమవంటి వనిత, తన జీవితంలోకి ప్రవేశించలేదు! అందుకనే తను అల్పజీవిగానే కాక, అప్రయోజకుడిగాకూడా ఈలోకంలో మిగిలిపోయేడు!....

అంతేకాక కొన్ని గుణాలలో శ్రీ కొమ్మూరి వేణుగోపారావుగారు వ్రాసిన, 'వ్యక్తిత్వంలేని మనిషి' అనే నవలలోని

కథానాయకుడు మృత్యుంజయరావుతోకూడా తనను పోల్చ వచ్చు!.... ఇంతకీ చెప్పొచ్చేదేవిటీ అంటే; తను అసమర్థుడు, అప్రయోజకుడు, అల్ప జీవి, వ్యక్తిత్వంలేని మనిషని!....

గతస్మృతులెన్నో గుర్నాథం మాష్టారి మస్తిష్కంలో మెద లేయి ఆత్మన్యూనతాభావం ఆవహించి అతడిని ఎంతగానో అవహేళనచేసింది. తన క్లాస్‌మేట్సు ఎందరో ఈనాడెంతో హాయిగావున్నారు. ప్రయోజకులయేరు!.... తనుమాత్రం?.... ఛీఛీ !.... తల్చుకోనేటందుకు తనకే సిగ్గుగావుంది!....

తన భార్య దృష్టిలో....

తన ఆత్మీయుల దృష్టిలో....

తన నెరిగిన లోకుల దృష్టిలో....

తనో అసమర్థుడు. అప్రయోజకుడు. అల్పజీవి. వ్యక్తిత్వం లేని మనిషి !

తన జన్మకొక ప్రయోజనం, పరమార్థం, సార్థకత ఏర్ప డాలంటే; తను చావాలి !

ఘోరమైన ప్రమాదానికిలోనై సునాయాసంగా చావాలి !

తనచావువల్ల పెద్దకొడుక్కి ఉద్యోగం,

పెళ్లానికి పెన్షన్,

పెద్దకుమార్తెకు పెళ్ళి,

తనకు శాశ్వతమైన విశ్రాంతి !.... శాంతి !

అబ్బో!.... చాలాప్రయోజనాలు !

అన్నట్లు అవాళ తనపెద్దకొడుకు; ఓ ప్రయివేటు కంపెనీ

వారు పెట్టిన ఇంటర్వ్యూకి వెళ్ళేడు. సెలక్టయేడో లేదో ?
నేడు జరుగుతున్న ఇంటర్వ్యూలు చాలావరకు వట్టి ఫార్సులుగా ముగుస్తున్నాయి. ఎవరికి ఉద్యోగాలివ్వడమో ముందుగానే నిర్ణయించేసుకొని, లోకాన్ని వంచించేటందుకు గాను ఇంటర్వ్యూ అనే తతంగాన్ని నిర్వహిస్తున్నారు !.... అన్నట్లు 'కాల్సు' పంపడంలో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌వారు ఎంత నిజాయితీగా వ్యవహరిస్తున్నదీ యీ లోకం కోడై కూస్తోంది !....

నేటి సామాజిక వ్యవస్థలో తనబోటివారు సుఖంగా బ్రతకలేరు. చావే తనబోటివారికి సుఖాన్నియిస్తుంది! !.... అంచేత తను చావును స్వాగతించక తప్పదు !.... తనబోటివారి బాధల్ని, కష్టాల్ని, క్లిష్ట సమస్యల్ని మృత్యువు మాత్రమే పరిష్కరించగలదు ! కనుక తనప్పుడు ప్రయాణంచేస్తున్న బస్సు ఘోరమైన ప్రమాదానికి లోనై తీరాలి. తను తక్షణమే సునాయాసంగా చావాలి !

డ్రైవర్ బస్సుని స్పీడుగానే డ్రైవ్ చేస్తున్నాడు. యాక్సిడెంటుపడానికవకాశాలు లేకపోలేదు. మందు కొట్టేడో లేదో? బహుశా 'మందు' కొట్టేవుంటాడనుకున్నారు గుర్నాధం మాష్టారు!.... డోసుకిమించి మందు కొట్టుంటేనే అతగాడికళ్లు బైర్లు కమ్ముతాయి!.... అతగాడికళ్ళు బైర్లుకమ్మి, చెయ్యి పట్టు తప్పితేనేగాని ఘోరమైన ప్రమాదం జరగదు. బస్సు ఏలోయలోకో తిరగబడడమో, ఎదురుగా వస్తున్న ఏలారీనో గుద్ది వేయడమో — ఇట్లాంటిదేదో జరిగితేనేగాని తనకు చావు రాదు. ఒకవేళ ఆబస్సు ఏదైనా యాక్సిడెంటుకిగురైనప్పటికీ,

తనుచావకపోతేనో?.... కాళ్ళో, చేతులోతెగి అంగవైకల్యంఏర్ప డితే?.... అమ్మో!.... అంతకుమించిన నరకంవేరొకటుండదు!....

ఇంతకీ తనచావుకోసం, తను ప్రయాణంచేస్తున్న బస్సు యాక్సిడెంటుకి లోనవాలని కోరుకోడంలో ఏమైనా ఔచిత్యం వుందా?.... ఒక్క తనుతప్ప, ఆబస్సులోకల మిగతా ప్రయాణీకులంతా బ్రతుకుపై ఆశగలవాళ్ళేనేమో!— వాళ్ళంతా తమ భవిష్యత్తుగురించి మధురాతి మధురమైన ఆశలు పెంచుకుంటున్నారేమో!....

గుర్నాధం మాష్టారు, ఆబస్సులోగల ప్రయాణీకులందరికేసి ఓసారి పరిశీలనగాచూసేరు.

కొత్తగా పెళ్ళయి హనీమూన్‌కి బయలుదేరిన యువ దంపతులు,

అత్తవారింటికి బయలుదేరిన నవవధువులు,

పుట్టింటికి పురిటికని వచ్చేచూలాళ్ళు,

పెళ్ళాల్ని చూసేటందుకు మావగారింటికి బయలుదేరిన అల్లుళ్ళు,

కూతుళ్ళకు పెళ్ళి సంబంధాల్ని చూసేటందుకు బయలు దేరిన తండ్రులు,

కొత్త ఉద్యోగాలలో జాయినయేటందుకు ఎంతో సంతోషంగా బయలుదేరిన యువతీ యువకులు,

పెద్దాసుపత్రిలో జాయినయేటందుకు బయలుదేరినరోగులు

కొత్తసినీమాల్ని చూసేటందుకని నగరానికి బయలుదేరిన సరదా రాయుళ్ళు,

కాలేజీల్లో చదువుకొనేటందుకై బయలుదేరిన విద్యార్థులు
వర్తక వ్యాపారాల నిమిత్తం బయలుదేరిన వాళ్ళు,
నగరంలో జల్సాచేసేటందుకై బయలుదేరినవాళ్ళు,........

....ఇట్లాంటివాళ్ళు అనేకమంది ఆబస్సులో ఉండవచ్చు !

ఒక్క తనచావుకోసం, ఎంతోమంది దారుణంగా మరణించే టందుకు, తీవ్రంగా గాయపడేటందుకు, శాశ్వితంగా అంగవైకల్యంగలవారయేటందుకు వీలుకల్పించే బస్‌ప్రమాదాన్ని తను వాంఛించడం, అమానుషమనుకున్నారు గుర్నాధంమాష్టారు. అందుకని యితరులకు ఎవ్విధమైన కష్టనష్టాలు కలుగనిరీతిలో, తను చావుని స్వాగతించడం సబవుగావుంటుందనుకున్నారు.

ఎట్లాంటి చావుని తను స్వాగతించడమాఅని గుర్నాధం మాషారు ఆలోచిస్తూండగానే, బస్సు ఆర్.టి.సి. బస్ కాంప్లెక్సులో ఆగింది.

అందరితోపాటు గుర్నాధంమాష్టారు కూడా బస్సులోంచి క్రిందకు దిగుతున్నప్పుడు అతని దృక్పథంలో పడ్డాడు పెద్ద కొడుకు తండ్రికి గౌరవపురస్సరంగా స్వాగతం పల్కి, "ఇవాళ్టి ఇంటర్వ్యూలో నేను సెలక్టయేను నాన్నగారు! రేపేడ్యూటీలో జాయనవమన్నారు మేనేజరుగారు!'' అనే శుభవార్తను చెప్పేడు

అప్రక్కనే నిలబడివున్న అతని పెద్దకూతురు, "రవిబాబుగారు నన్ను వివాహంచేసుకొనేటందుకు అంగీకరించేరు నాన్నగారూ" అని సిగ్గుపడుతూ చెప్పింది.

అంతవరకు చావుకి స్వాగతం పలికిన గుర్నాధంమాష్టారికి, చావంటే అప్పుడు భయం పట్టుకుంది !

బస్సుదిగేసరికి; తన పెద్దకొడుకు, పెద్దకూతురు తనకు శుభవార్తలతో అట్లా స్వాగతం పలుకుతారనుకోలేదుగుర్నాధం మాష్టారు!

[1986వ సంవత్సరం, సెప్టెంబరునెల "భారతి" సాహిత్య మాసపత్రికలో ప్రచురించబడిన కథానిక యిది.]

